క్లుప్తంగా

నేడు నగరిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ /నగరి : ప్రజా సమస్యల పరిష్కారం కోసం గురువారం నగరిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగరి ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. నియోజకవర్గంలో ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలన్నారు. నియోజకవర్గంలోని అధికారులు కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాల్య వివాహాలు నేరం



కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

వెదురుకుప్పం: మండలంలోని దిగువపల్లాలు పంచాయతీ ఎగువపల్లాలు గ్రామంలో బాల్య వివాహం జరుగుతోందన్న సమాచారం అందడంతో కార్వేటినగరం ఐసీడీఎస్ అధికారులు బుధవారం వెదురుకుప్పం పోలీస్ స్టేషన్‌లో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎగువపల్లాలు గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహాలు చేయడం నేరమని బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మోహన్‌కృష్ణ

పాలసముద్రం : మండల పరిధిలోని ప్రతి గర్భిణులు సకాలంలో వైద్య పరీక్షలు చేసుకుంటేనే మాతాశిశు మరణాలు జరగవని వైద్యాధికారి మోహన్‌కృష్ణ, లోకేష్ తెలిపారు. బుధవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు హిమోగ్లోబిన్, బీపీ, షుగర్, హెచ్ఐవీ, హెచ్‌బీఎస్ఏజీ వంటి పరీక్షలు చేశారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారంతో పాటు మజ్జిగ, పండ్లరసం, ఆకుకూరలు, ఎక్కువగా నీరు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు ప్రతి నెలా వైద్య పరీక్షలు తప్పక చేసుకోవాలన్నారు. అనంతరం 34 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, మురళి, గర్భిణులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని వినతి

పుత్తూరు: వడమాలపేట మండలంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు కోరారు. వారు బుధవారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రోడ్లు, కాలువలు నిర్మించాలని, విద్యుత్ దీపాలు వేయాలని, తాగునీటిని సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే భానుప్రకాష్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు జయంత్‌బాబు, లోకనాథం, దేవరాయులు, డేవిడ్, నాగరాజు, వెంకటేష్, మస్తాన్, వినోద్ పాల్గొన్నారు.

26, 27 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నింద్ర: చిత్తూరులో ఈ నెల 26, 27 తేదీల్లో సీపీఎం జిల్లా మహా సభలు నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గంగరాజు తెలిపారు. ఆయన బుధవారం నింద్రలో ఆ పార్టీ, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మట్లాడుతూ పేదల సమస్యల పరిష్కారానికి సీపీఎం అన్ని వేళలా పోరాటాలు చేస్తోందని తెలిపారు. నింద్ర షుగర్ ఫ్యాక్టరీ మూత పడిన తర్వాత రైతులకు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్టు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే చిత్తూరులో జరిగే జిల్లా మహాసభలకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పార్టీ నింద్ర మండల కార్యదర్శిగా సంతోష్ కూమార్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఓబుళరాజు, చిరంజీవమ్మ, మల్లిక పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ

వెదురుకుప్పం: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ రికార్డులను తనిఖీ చేశారు. అదేవిధంగా సిబ్బంది పనితీరు, రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆరా తీశారు. తహసీల్దార్ రమేష్‌బాబుకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

సిలిండర్ కోసం తప్పని తిప్పలు

- బుకింగ్ చేసుకుంటే చాలదు.. ఓటీపీ కూడా చెప్పాలి
- ఇబ్బంది పడుతున్న వినియోగదారులు



సిలిండర్ల వాహనం వద్ద గుమిగూడిన వినియోగదారులు

నగరి : గత ఐదేళ్లపాటు సిలిండర్ పొందడానికి లేని కష్టాలు మళ్లీ మొదలైంది. వీధిలో సిలిండర్ వాహనం వస్తే అవసరమైన వారు వెళ్లి తమ పుస్తకాలు అందిస్తే డెలివరీ బాయ్ సర్వీసు నంబరు నోట్ చేసుకుని డబ్బులు తీసుకుని సిలిండర్ ఇచ్చి వెళ్లిపోయేవాడు. కొత్త ప్రభుత్వం వచ్చాక పద్ధతులు మారాయి. సిలిండర్ పొందాలంటే వినియోగదారుడే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని గ్యాస్ ఏజెన్సీ వారు తెలుపుతున్నారు. గతంలోలా బుక్ చేసుకుని ఏజెన్సీ వారికి ఫోన్ చేస్తే డెలివరీ బాయ్స్ సిలిండర్ తీసుకువచ్చి ఓటీపీ చెప్పమని అడుగుతున్నారు. కోడ్ మాత్రమే ఉందని ఓటీపీ రాలేదని చెబితే ఓటీపీ వస్తేనే సిలిండర్ ఇస్తామని చెబుతున్నారు. బుక్ చేసుకున్నాం కదా అని చెప్పినా అది బుకింక్ కోడ్ మాత్రమే ఓటీపీ చెప్పాల్సిందేనని పేర్కొంటున్నారు. దీంతో వినియోగదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వినియోగదారునికి వచ్చే మెసేజ్‌లో ఓటీపీ ఉండడం లేదు. ఎందుకు ఓటీపీ రావడం లేదని ఏజెన్సీ వారిని ప్రశ్నిస్తే మొబైల్ లింక్ చేసుకోవాలని, లేకుంటే ఓటీపీ రాదని చెబుతున్నారు. నియోజకవర్గంలో హెచ్‌పీ, ఇండేన్, భారత్ గ్యాస్ కనెక్షన్లు సుమారు 70 వేల దాకా ఉన్నాయి. కనెక్షన్లు ఉన్నవారికి బుకింగ్ ప్రక్రియ ముగించి ఒక సిలిండర్ ఇంటికి తెచ్చుకోవడం గగనంగా మారుతోంది.

ఒక సిలిండర్‌కు అంతదూరం రాలేం

గతంలో వీధిలోకి సిలిండ్ వాహనం వస్తే కావలసిన వారు అక్కడే తీసుకునే వారు. ప్రస్తుతం బుకింగ్ ప్రక్రియ ఉండడం, ఇందులో ఓటీపీ వచ్చేవారు అక్కడక్కడా ఉండడంతో ఒక్కో సిలిండర్ కోసం అక్కడకు రాలేం. అక్కడకు వస్తే మిగిలినవారు అడిగితే సమాధానం చెప్పలేం. రోడ్డు పైకి వస్తాం అక్కడకు వచ్చి సిలిండర్ తీసుకోండి అని డెలివరీ బాయ్స్ చెబుతున్నారు. ఎక్కడ సిలిండర్ వాహనం ఆగినా అక్కడికే వినియోగదారులు పరుగులు తీస్తున్నారు.

ముందస్తు అవగాహన కల్పించలేదు



"గతంలో వీధిలోకి సిలిండర్ వాహనం వస్తే బుక్ వారికిచ్చి సిలిండర్‌కు అయ్యే డబ్బులు ఇచ్చి తీసుకెళ్లేవారం. ప్రస్తుతం ఆన్‌లైన్ బుకింగ్ అని ఓటీపీ చెప్పాలని కొత్త పద్ధతి పెట్టారు. అది ఎలా చేసుకోవాలి, ఫోన్ నంబరు ఎలా లింక్ చేసుకోవాలి అన్నదానిపై అవగాహన కల్పించలేదు. దీంతో సిలిండర్ బుక్ చేసుకుని తెచ్చుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నాం.

– ప్రకాష్, గ్యాస్ వినియోగదారుడు, ముడిపల్లి

గతంలో కోడ్ చెబితే ఇచ్చేవారు



ఐదేళ్ల క్రితం వరకు గ్యాస్ కోసం బుక్ చేసుకుని కోడ్ చెబితే సిలిండర్ వచ్చేది. గత ఐదేళ్ల బుకింగ్ చేయకున్నా డెలివరీ బాయ్ బుక్ చేసి సిలిండర్ ఇచ్చేసి వెళ్లేవాడు. దీంతో బుకింగ్ ప్రక్రియ మరిచిపోయాం. ప్రస్తుతం కోడ్‌తో పాటు ఓటీపీ చెబితేనే సిలిండర్ ఇస్తామంటున్నారు. అదెలా చెయ్యాలో అవగాహన కూడా కల్పించలేదు.

– నాగరాజు, మాధవరం

మండల అభివృద్ధికి కృషి చేద్దాం



ఎంపీడీఓ అమరనాథ్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, నేతలు

వెదురుకుప్పం: అందరి సహకారంతో మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకుందామని ఎంపీపీ నాగరాణి అన్నారు. బుధవారం ఎంపీపీ కార్యాలయంలో ఇటీవల కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ అమరనాథ్‌ను కలిసి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎంపీపీ నాగరాణి మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుకుమార్, ఎంపీటీసీలు గుణశేఖర్, చిన్నబ్బ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పేట ధనుంజయరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, సర్పంచ్ గోవిందయ్య, నాయకులు పురంధర్‌రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, హరినాథ్, దామోదర్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

వెదురుకుప్పం: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు కృషి చేయాలని ఏఓ వనిత అన్నారు. బుధవారం మండలంలోని పాతగుంట, కేవీఎం అగ్రహారం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సాగుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటల సాగులో ఆధునిక పద్ధతులను అవలంభించడం ద్వారా అధిక ప్రయోజనాలు పొందవచ్చన్నారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పంటల సాగులో అనుసరించాల్సిన పద్ధతులు, పలు సలహాలు అందేశారు.

అన్నివేళలా వైద్యసేవలు



వైద్యులకు సూచనలిస్తున్న డీసీహెచ్ఎస్ ప్రభావతి

నగరి : ఆస్పత్రికి వచ్చే రోగులకు అన్ని వేళలా వైద్యసేవలు అందించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి ఆదేశించారు. ఆమె బుధవారం నగరి ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఇన్ పేషెంట్, ఎమర్జెన్సీ, డెలివరీ వార్డులు, రక్త పరీక్షల ల్యాబ్‌ను పరిశీలించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ తాను ఇక్కడ పనిచేసి డీసీహెచ్ఎస్‌గా బదిలీ అయినట్టు తెలిపారు. ఇక్కడి అవసరాలు తనకు తెలుసని, వాటిని సమకూర్చేందుకు అన్ని విధాలాగా ప్రయత్నిస్తానన్నారు. మెడికల్ సూపరింటెండెంట్ జరీనా, ఆర్ఎంఓ కార్తికేయన్, వైద్యులు ప్రవీణ, ప్రశాంతి, దీప్తి, శ్రీనాథ్, లోకేష్ పాల్గొన్నారు.

చెరుకులో మెలకువలు పాటించండి



చెరుకు, వరి మంట సాగుపై వివరిస్తున్న ఏఓ ఢిల్లీప్రసాద్

పాలసముద్రం : మండల పరిధిలోని రైతులు చెరుకు, వరి యాజమాన్యంలో మెలకువలను పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చని ఏఓ ఢిల్లీప్రసాద్ తెలిపారు. బుధవారం బాలకృష్ణాపురం శ్రీకావేరిరాజుపురం పంచాయతీ ఏటుకూరిపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో ఏఓ మాట్లాడుతూ చెరుకు మరదాము సాగులో కలుపు నివారణ, సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రిప్ పద్ధతిలో తక్కువ నీటితో ఎక్కువగా చెరుకు సాగు చేసుకోవచ్చని తెలిపారు. చెరుకులో కొత్తరకం వంగడాలను పరిశీలించారు. కొబ్బరి చెట్లకు ఆశించిన తెల్లగొన నివారణ గురించి వివరించారు. తెల్లదోమ నుంచి చెరుకు పంటలకు వ్యాపించడం గమనించి ఈ తెల్లదోమ నివారణకు మందులు ఎలా పిచికారీ చేయాలని వివరించారు. వరిపంటలో డ్రమ్ సీడర్ పద్ధతిలో పంటసాగు చేసుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చని, కూలీలు కూడా తక్కువే, వరిలో ఆకుముడుత, కాడము తొలుచు పురుగు నివారణ చర్యలు, చెరుకులో ఎరువులు వాడేటప్పుడు తీసుకోవాలని జాగ్రత్తలను క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేష్, మండల విస్తరణాధికారి రమేష్, వనిత, రైతులు పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరం



షాపుల వద్ద అవగాహన కల్పిస్తున్న కార్మిక శాఖ అధికారులు

పుత్తూరు: పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర తెలిపారు. ఆయన బుధవారం కార్మిక, ఐసీడీఎస్ అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు చిన్న పిల్లలను హోటళ్లలో, వెల్డింగ్ షాపుల్లో, ఇతర వాణిజ్య సముదాయాల్లో పనిలో పెట్టుకోకూడదని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను అతిక్రమించిన వారు శిక్షార్హులని తెలిపారు. అనంతరం లేబర్, ఐసీడీఎస్ సిబ్బంది పట్టణంలోని పలు దుకాణాల వద్ద తనిఖీలు నిర్వహించారు. చిన్న పిల్లలను పనిలో పెట్టుకుంటే శిక్షార్హులవుతారని అవగాహన కల్పించారు. బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, పిల్లలతో పనులు చేయించరాదని వివరించారు.

రైతులు సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలి





మాట్లాడుతున్న ఏఓ కోదండయ్య, సంపంగి తోటలో సూచనలిస్తున్న హెచ్ఓ సౌజన్య

పుత్తూరు: ఉద్యానవన పంటలకు అందిస్తున్న వివిధ రకాల రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవనశాఖాధికారి వెంకటసౌజన్య తెలిపారు. పుత్తూరు మండలం కైలాసపురం, నందిమంగళం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 90 శాతం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లు అందజేస్తున్నామని తెలిపారు. సంపంగి, చామంతి, బంతి, రోజా తోటలు సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.6,400 రాయితీ ఇస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయాధికారి కోదండయ్య మాట్లాడుతూ రబీ సీజన్‌లో ముందస్తుగా విత్తన ఎంపిక, పొలం తయారీ, విత్తన శుద్ధి ప్రాముఖ్యతను వివరించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ప్రతి మంగళ, బుధ వారాల్లో వ్యవసాయాధికారులతో పాటు అనుబంధ శాఖ అధికారులు పొలం బాట పడతారని తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ సెల్వం తదితరులు పాల్గొన్నారు.

జగమేలు తల్లి.. జనకల్పవల్లి











నగరి : గాయత్రీదేవిగా ఒన్నూరమ్మ, సరస్వతీ దేవి అలంకరణలో దేశమ్మ, కామాక్షీ దేవి, పుత్తూరు: లక్ష్మీదేవిగా ఆరేటమ్మ, సరస్వతీ దేవి అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు

నగరి : నియోజకవర్గంలోని అమ్మవారి ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. బుగ్గ అగ్రహారం ఒన్నూరమ్మ అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. టీఆర్ కండ్రిగలోని దేశమ్మ సరస్వతీ దేవిగా, నగరిలోని కరకంతేశ్వరాలయంలో కామాక్షి అమ్మవారు సరస్వతి అమ్మవారిగా దర్శనమిచ్చారు. టీటీడీ ఆధీనంలోని బుగ్గ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం అన్నపూర్ణాదేవికి కాలరాత్రి అలంకారం చేశారు. స్థానిక ఓంశక్తి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తుల కోలాటాలు ఆకట్టుకున్నాయి.

సరస్వతీ ..నమోస్తుతే..

కార్వేటినగరం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీబంగారమ్మ సరస్వతీదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, నారికేళీ జలాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం ఉభయదారులైన ఉదయకుమార్‌శెట్టి కుటుంబ సభ్యులు అమ్మవారికి సమర్పించిన పట్టువస్త్రాలు, సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలను అందించారు. అలాగే మధ్యాహ్నం మూడు గంటలకు ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ఆధ్వర్యంలో 5 ఏళ్లలోపు ఉన్న చిన్నారులకు పలక, బలపం అందించి వేదపండితులచే శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు రంగనాథ మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్ పిళ్లై పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో..

మండల పరిధిలోని ఆళత్తూరు సమీపంలో వెలసిన శ్రీముత్యాలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : మండలంలోని బలిజకండ్రిగ గ్రామంలో వెలసిన చెవుటి గంగమ్మ తల్లి, మిద్దినత్త గ్రామంలో వెలసిన పడవేటమ్మ, మండల సరిహద్దులో ఉన్న నొచ్చిలి గ్రామంలో వెలసిన గిరిరాజ కన్యకా పరమేశ్వరీ సమేత అమ్మవార్లను బుధవారం పడవేటమ్మ తల్లిని సరస్వతీదేవి, పరమేశ్వరి సమేతంగా పార్వతీపరమేశ్వరుల అలంకరణలో దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారి ఆలయంలో మొక్కులు ఉన్న మహిళలు పిండిదీపాలు వెలిగించి తీర్చుకున్నారు.







నగరి : కాలరాత్రి అలంకరణలో అన్నపూర్ణేశ్వరి ఊరేగింపు, ఓంశక్తి ఆలయం వద్ద మహిళల కోలాటం, అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ థామస్

లక్ష్మిదేవిగా ఆరేటమ్మ

పుత్తూరు: పట్టణంలోని ద్రౌపదమ్మ, ఆరేటమ్మ, కామాక్షమ్మ, కన్యకాపరమేశ్వరి అమ్మవార్లు బుధవారం వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆరేటమ్మ లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వడమాలపేటలో ఉన్న కన్యకాపరమేశ్వరి, పూడి క్రాస్ వద్ద ఉన్న అంకాలమ్మ ని సరస్వతీదేవి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు.

సరస్వతీ దేవి అలంకరణలో మహాలక్ష్మి

నింద్ర: మండలంలోని కేఆర్ పాళెం గ్రామంలో వెలసిన శ్రీ మహాలక్ష్మి ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం అమ్మవారు సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. ఉదయం హోమం నిర్వహించారు. గీతా మందిరం ఆశ్రమ పీఠాధిపతి పుండరీక వరదానంద స్వామి ప్రత్యేక పూజలు చేశారు. సరస్వతీ దేవి అమ్మవారిని పూజిస్తే జ్ఞానాన్ని పొందవచ్చని తెలిపారు.

జీడీనెల్లూరులో..

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలో కొలువైన శ్రీ అల్లిఎల్లమ్మ తల్లి దేవస్థానంలో దసరా ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు బుధవారం సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మూలవిరాట్ అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో ఆలయ అర్చకులు, ఉభయ దారులైన మునిరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాదాపు 500 మందికి రవి రెడ్డి, చిట్టి, శరన్ కుమార్ కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు పార్థసారథి రెడ్డి, నిర్వాహకులు గుణశేఖర్ రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సుబ్రహ్మణ్యం యాదవ్ గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఉన్న రాజరాజేశ్వరి దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఏడో రోజు బుధవారం అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే చవటగుంటలో మీనాక్షి సమేత అవుదేవ నందీశ్వర స్వామి ఆలయంలో మీనాక్షి అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులను కటాక్షించారు.

అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

శ్రీరంగరాజపురం : మండలంలోని తయ్యూరు పాయికట్టు ఆరిమాకులపల్లి గ్రామంలో వెలసిన శ్రీ ఆరిమాని గంగమ్మ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈఓ తిమ్మారెడ్డి, తహసీల్దార్ లోకనాథపిళ్లై, ఎంపీడీఓ మోహన్‌మురళి, ఆలయ చైర్మన్ లింగారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు జయశంకర్‌నాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.













సరస్వతీదేవిగా బంగారమ్మ, ముత్యాలమ్మ, పాలసముద్రం : సరస్వతీదేవిగా పడవేటమ్మ, పార్వతీ పరమేశ్వరుల అలంకరణ, ఉత్సవ విగ్రహం, సరస్వతీ దేవిగా రాజరాజేశ్వరి

సన్మానం



బదిలీపై వెళ్తున్న వారిని సన్మానిస్తున్న సచివాలయ ఉద్యోగులు

పాలసముద్రం : స్థానిక గ్రామ సచివాలయంలో పని చేస్తూ బదిలీపై వెళ్తున్న వారికి ఉద్యోగులు బుధవారం సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి ధరణిప్రసాద్ పాకాల మండలం, వీఆర్ఓ ఆనందనాయుడు చిత్తూరు రూరల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అక్షయ్ విజయపురానికి బదిలీ అయ్యారు. వారికి పూలమాల వేసి దుశ్శాలువాలతో సత్కరించారు. డిజిటల్ అసిస్టెంట్ శివ, వెల్ఫేర్ అసిస్టెంట్ చెంచయ్య, విలేజ్ సర్వేయర్ అలీ, మహిళా పోలీస్ జీవన రేఖ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

బంగారుపాళెం: సేంద్రియ ఎరువులు వాడితే అధిక దిగుబడి సాధించవచ్చని తిరుపతి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త నాగమణి సూచించారు. మండలంలోని బొమ్మాయిపల్లె, తిమ్మోజుపల్లె పంచాయతీల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మామిడి, వరి, వేరుశనగ పంటలను ఆశించే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కలుపు మందుల వినియోగం గురించి రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయం సాగులో వినియోగించే ఘనజీవామృతం, ద్రవ జీవామృతాన్ని తయారు చేసుకునే పద్ధతిని రైతులకు ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. వ్యవసాయాధికారులు చిట్టిబాబు, పద్మజ వ్యవసాయశాఖ ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి రైతులకు తెలియజేశారు. అనంతరం క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ సాదరయ్య రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

ఐరాల: భూసార పరీక్షలు ఆధారంగా ఎరువులు వాడితే ఖర్చు తగ్గి నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని ఏఓ వరలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని పుల్లూరు, ఎగువ చవటపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు ముఖ్యంగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. దానికి అనుగుణంగా ఎరువులు దాంతో పాటు మందులను వాడుకుంటే ఖర్చు తగ్గడంతో పాటు రైతులకు నాణ్యమైన దిగుబడులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. రైతులు సాగు సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏ పంటకు ఏ మందులు వాడాలో అవగాహన పెంచుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు తప్పక పాటించాలన్నారు. ఈ-క్రాప్ నమోదు ఉంటేనే ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ పరిహారం అందుతాయన్నారు.